



# కరపత్రం

SINCE 2014

బుధవారం జనవరి 29 2025 | సంపుటి :0 | సంచిక : 108 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# పర్యాటక పాలసీ తీసుకొచ్చి ఎకో టూరిజాన్ని ప్రోత్సహిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

**ఎక్స్ పీరియం పార్క్ అద్భుతం.. ఎకో టూరిజం, టెంపుల్ టూరిజంలో వెనుకబడ్డాం**

- చిలుకూరు బాలాజీ టెంపుల్ రోడ్డులో ఉన్న శంకర్ పల్లి మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఎక్స్ పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్క్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.
- 150 ఎకరాల్లో 85 దేశాలకు చెందిన 25 వేల మొక్కలతో ఎక్స్ పీరియం పార్క్‌ను రాందేవ్ రావు ఏర్పాటు చేశారు.
- ఎక్స్ పీరియం పార్క్‌ను సినీ నటుడు చిరంజీవితో కలిసి సీఎం రేవంత్ సందర్శించారు.



హైదరాబాద్: కోట్ల రూపాయలు విలువ చేసే మొక్కలతో ఎకో ఫ్రెండ్లీ పార్క్ ఏర్పాటు చేసిన ఎక్స్ పీరియం పార్క్ చైర్మన్ రాందేవ్ రావును సీఎం అభినందించారు. మొత్తం 150 కోట్ల రూపాయలు విలువ చేసే మొక్కలతో ఎకో ఫ్రెండ్లీ పార్క్ ఏర్పాటైంది. పార్క్‌లో లక్ష విలువ చేసే చెట్ల నుంచి మూడు కోట్ల విలువ చేసే చెట్లు ఏర్పాటు చేశారు. పార్క్‌లో రూ.5 లక్షల నుంచి కోటి విలువైన శిల్పాలు నిర్మాణం కూడా ఆకట్టుకున్నాయి. పార్క్‌లో మొత్తం శిల్పాల విలువ రూ.15 కోట్లకు పైమాటే.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారులు మంత్రులతో చర్చించి ఐటీ, ఇన్ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో రాణించామని సీఎం తెలిపారు. తెలంగాణకు రావాల్సిన టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం రాలేదని,

పేజి 2లో

## వరల్డ్ ఫేమస్ చెట్లతో ఎకో పార్క్ ఆకట్టుకుంటోంది : సినీ నటుడు చిరంజీవి



2 లో

## మేం సాధించిన విజయాల్లో దావోస్ ఒప్పందాల సాధన అతి పెద్దది: రేవంత్‌రెడ్డి

తమ ప్రభుత్వం సాధించిన విజయాల్లో దావోస్ ఒప్పందాల సాధన అతి పెద్దదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

2 లో

## కొమురవెల్లి మల్లన్న గుడిలో అఘోరి నాగసాధువు ఇలా చేసిందేంటి..?



2 లో

కొమురవెల్లి మల్లన్న గుడిలో అఘోరి నాగసాధువు నానా రచ్చ చేసింది. కత్తితో పలువురిపై దాడి చేస్తూ భక్తులను భయభ్రాంతులకు గురిచేసింది. ఆలయ ప్రధాన ద్వారం నుంచి స్వామివారి దర్శనానికి అనుమతి ఇవ్వాలని మొండిపట్టు పట్టింది. బట్టలు వేసుకొని దర్శనానికి రావాలని ఆలయ అధికారులు సూచించారు. భక్తులు ఆమె తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

## మోదీ నోట 'కోల్డ్ ప్లే' మాట.. కాన్సర్ట్ ఎకానమీకి ప్రధాని బూస్ట్

- ప్రఖ్యాత మ్యూజిక్ బ్యాండ్ 'కోల్డ్ ప్లే' ప్రదర్శనల గురించి ప్రస్తావించారు ప్రధాని మోదీ.
- కాన్సర్ట్ ఎకానమీకి బూస్ట్ ఇచ్చే దిశగా మౌలిక సదుపాయాలను



2 లో

## మీర్‌పేట హత్యకేసు.. నిందితుడి అరెస్టు




2 లో

తెలంగాణలో సంచలనం సృష్టించిన మీర్‌పేట హత్య కేసు నిందితుడు గురుమూర్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడిని ఇంటికి తీసుకెళ్లి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. తన భార్య వెంకట మాధవిని గురుమూర్తి కిరాతకంగా హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలు, ముక్కలుగా చేసి కుక్కర్‌లో ఉడికించిన సంగతి తెలిసిందే. ఎముకలను కాల్చి బూడిద చేసి చెరువులో పడేశాడు. ఆ తర్వాత ఏమీ తెలియనట్లు ఆమె తల్లి సుబ్బమ్మతో కలిసి జనవరి 16న మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనాలోచిత చర్యల వల్ల తెలంగాణకు తీవ్ర నష్టం కలుగుతుందని బీఆర్ఎస్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



## రేవంత్ రెడ్డి అనాలోచిత చర్యల వల్ల తెలంగాణకు తీవ్ర

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదాయాన్ని మరింత పెంచడం కోసం, ఈ రాష్ట్ర బాగోగుల కోసం, ఈ రాష్ట్రంలో ఒక గొప్ప ఇండస్ట్రీని పెట్టడం కోసం వేలాది మందికి ఉద్యోగాలు వచ్చే విధంగా లక్షలాది, కోట్లాది రూపాయల రెవెన్యూ విచ్చే విధంగా ప్లాన్ చేయడం కోసం మొబిలిటీ వ్యాలీ అనే కార్యక్రమానికి సంకల్పించిందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మరి గత ప్రభుత్వం ఫార్ములా ఈ రేస్ అని ఒక రేస్ కూడా నిర్వహించడం జరిగింది. మరి అదే రేసు ఇంకా నాలుగు సార్లు ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా జరగాల్సి ఉండే. కానీ ఈరోజు రేవంత్ రెడ్డి అనాలోచిత చర్య వల్ల మొబిలిటీ వ్యాలీ రాకుండా పోయింది.

పేజి 2లో

# తెలంగాణలో బీఆర్ఎస్ చాప్టర్ క్లోజ్



- త్వరలో జరగనున్న మూడు స్థానాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉంటున్నట్లు పొలిటికల్ సర్కిల్లో ప్రచారం జరుగుతోంది.
- ఈ క్రమంలో బీఆర్ఎస్ పోటీ చేయడం లేదన్న వార్తలపై బీజేపీ నేత, మెదక్ ఎంపీ రఘునందన్ రావు రియాక్ట్ అయ్యారు.
- మంగళవారం (జనవరి 28) ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీఆర్ఎస్ ముఖం చాటేసిందన్నారు.

కేసీఆర్ సొంత జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి ఎమ్మెల్సీ అభ్యర్థులు లేరా అని ఆయన ప్రశ్నించారు. పదేళ్లు అధికారం చలాయించిన బీఆర్ఎస్ టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టకపోవడం దారుణమని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ విషయంపై కేసీఆర్,

పేజి 2లో



# ఏడాదైనా 'రైతు బంధు' నిధులు విడుదలయ్యాయా?: కేటీఆర్

- ఆనాడు నిజాం సర్కారును నిలదీసిన గడ్డ నల్గొండ అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.



2లో

## మహారాజులు ఏం చేశారో రాహుల్ తెలుసుకొని మాట్లాడాలి: సింధియా



పూర్వం రాజ కుటుంబాలు చేసిన సహకారాలను విస్మరించడం రాహుల్ గాంధీ అజ్ఞానానికి నిదర్శనమని రాజ కుటుంబ వారసులు, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, ఎంపీ దుశ్యంత్ సింగ్ విమర్శించారు.

దిల్లీ: భాజపా , ఆర్ఎస్ఎస్ లు దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం నాటి పరిస్థితులను కోరుకుంటున్నాయని ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై రాజ కుటుంబ వారసుడు, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆగ్రహం వ్యక్తంచేశారు. స్వాతంత్ర్యానికి పూర్వం రాజులకు తప్ప వెనకబడిన వర్గాలకు ఎలాంటి అధికారాలు లేవని రాహుల్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. మహారాజులు ప్రజల కోసం ఏం చేశారో ముందు తెలుసుకొని తరువాత ఇలాంటి వ్యాఖ్యలు చేయాలన్నారు. బరోడా రాజు సాయాజీరావ్ గైక్వాడ్ బాబా సాహెబ్ అంబేద్కర్ విద్యకు సాయం చేశారని గుర్తు చేశారు.

1902లో షాహూజీ మహారాజ్ వెనకబడిన తరగతులకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి.. సామాజిక న్యాయానికి పునాది వేశారని అన్నారు. గ్వాలియర్ మాధవ్ మహారాజ్ వెనకబడిన తరగతుల సాధికారత కోసం విద్య, ఉద్యోగ కేంద్రాలను స్థాపించారని అన్నారు. ధోల్పూర్ రాజ కుటుంబీకులు సామాజిక, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కూడా కీలకపాత్ర పోషించారని.. మహారాజ్ రాణా నిహాల్ సింగ్ పరిపాలనను ఆధునికీకరించారన్నారు. అప్పట్లోనే ఆయన రహదారులు, ఆసుపత్రులు, రైల్వేలు మొదలైన మౌలిక సదుపాయాలు కల్పించారని పేర్కొన్నారు.

రాజులు ప్రజలకు చేసిన సహాయాలను విస్మరించడం రాహుల్ అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు. నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం ఆయనకు అలవాటేనని.. ఇప్పటికైనా వాటినుంచి బయటకు వచ్చి ప్రజల సమస్యలపై ఆలోచించాలని సూచించారు. దళితులు, వెనకబడిన తరగతుల వారి హక్కులను కాలరాసిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందని దుయ్యబట్టారు. రోజూ రాజ్యాంగాన్ని జేబులో పెట్టుకొని తిరిగే రాహుల్ అధికార కాంక్షతోనే అలా మాట్లాడుతున్నారని ఎంపీ దుశ్యంత్ సింగ్ మండిపడ్డారు.

సోమవారం మధ్యప్రదేశ్‌లోని మహులో నిర్వహించిన సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. భాజపా , ఆర్ఎస్ఎస్‌లు దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం నాటి పరిస్థితులను కోరుకుంటున్నాయని ఆరోపించారు. పూర్వం రాజుల పాలనలో దళితులు, వెనకబడిన వర్గాలు, ఆదివాసీలు, పేదలను బానిసలుగా చూసేవారని.. వారికి ఎటువంటి హక్కులు ఉండేవి కావని అన్నారు.

## దిల్లీ, హరియాణా ప్రభుత్వాల మధ్య యమునా వార్



దిల్లీ: హరియాణా నుంచి దిల్లీ కి ప్రవహిస్తున్న యమునా నదిలో అమోనియం స్థాయిలు ఆరు రెట్లు అధికంగా ఉన్నాయని దిల్లీ సీఎం అతిశీ పేర్కొన్నారు. హరియాణా ప్రభుత్వం యమునా నదిలోకి పారిశ్రామిక వ్యర్థాలను వదులుతోందని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ అంశంపై అతిశీ స్పందించారు. ఈవిషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈమేరకు ఎక్స్ వేదికగా ఓ లెటర్ విడుదల చేశారు.'హరియాణా నుంచి దిల్లీలోకి ప్రవేశిస్తున్న యమునా నదిలోని నీటిలో అమోనియా స్థాయిలు ఆరు రెట్లు అధికంగా ఉంటున్నాయి. ఇవి మానవ శరీరానికి చాలా ప్రమాదం. ఈ నీటిని శుద్ధి చేసి దిల్లీ ప్రజలకు పంపిణీ చేయడం సాధ్యం కాదు. దిల్లీ జల్ బోర్డుకు చెందిన నీటి శుద్ధి కర్మాగారాలు అమోనియా స్థాయిలు 1పీపీఎం వరకు శుద్ధి చేయగలవు. కానీ, హరియాణా నుంచి వస్తున్న నీటిలో ఆ పరిమితులు అధికంగా ఉన్నాయి. దీని కారణంగా దేశ రాజధానిలో దాదాపు 34 లక్షల మంది ప్రజలకు నీటి సరఫరా 15-20 శాతం తగ్గిపోయింది. ఈ నీటి వల్ల మూత్రపిండాలు దెబ్బతినడంతో పాటు శ్వాశకోస ఇబ్బందులు వస్తాయి. ఈ విషయాలన్నీ హరియాణా ప్రభుత్వానికి తెలుసు. అయినా ఉద్దేశపూర్వకంగా నీటిలో పారిశ్రామిక వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. ఇది నిర్లక్ష్యపు చర్య కాదు. జల ఉగ్రవాదం. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగే ఎన్నికలపై ప్రభావం చూపాలనే ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నారు' అని అతిశీ పేర్కొన్నారు. ఇక, ఈ విషపూరితమైన నీరు దిల్లీకి రాకుండా అడ్డుకునేందుకు ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలని ఆమె అభ్యర్థించారు.

మరోవైపు ఆప్ చేస్తున్న ఆరోపణలను హరియాణా సీఎం నయాబ్‌సింగ్ సైనీ ఖండించారు. ఆరోపణలు చేసి తప్పించుకోవడం కేజ్రీవాల్ స్వభావమంటూ విమర్శలు చేశారు. నీటి పంపిణీ చేయడం తెలియక ఇతరులపై నిందలు వేస్తున్నారన్నారు. ఆప్ తన చీఫ్ సెక్రటరీని పంపిస్తే.. సోనిపట్ వద్ద దిల్లీలోకి ప్రవేశిస్తున్న నీటి నాణ్యతను తనిఖీ చేయమని అధికారులను ఆదేశిస్తామన్నారు.

# ఏడాదైనా 'రైతు బంధు' నిధులు విడుదలయ్యాయా?: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

నల్గొండ: ఆనాడు నిజాం సర్కారును నిలదీసిన గడ్డ నల్గొండ అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈ జిల్లాకు మాజీ సీఎం కేసీఆర్ ఏం చేశారని అసెంబ్లీలో ఓ మంత్రి అడిగారన్న ఆయన.. వరి ఉత్పత్తిలో జిల్లాను నెంబర్ వన్ చేశారని చెప్పారు. నల్గొండ క్లాక్‌టవర్ కూడలిలో భారాస రైతు మహా ధర్నా నిర్వహించారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సహా పలువురు ముఖ్య నేతలు ఈ ధర్నాలో పాల్గొరు. తొలుత నాగార్జున కళాశాల వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి కేటీఆర్ నివాళు లర్పించారు. అక్కడి నుంచి క్లాక్ టవర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ..“ రైతు బంధు కింద కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రూ.73 వేల కోట్లు ఇచ్చింది. నల్గొండ బిడ్డలు జీవచ్ఛవంగా మారడానికి కారణం కాంగ్రెస్. ఆ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రాం రాం అవుతుందని కేసీఆర్ ఎప్పుడో చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా రైతుబంధు నిధులు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది” అని కేటీఆర్ విమర్శించారు.

# కొమురవెల్లి మల్లన్న గుడిలో అఘోరి నాగసాధువు ఇలా చేసిందేంటి..?

మొదటిపేజీ తరువాయి

సిద్దిపేట జిల్లా: దీంతో.. ఆమె భక్తులపై తన వెంట తెచ్చుకున్న ఖడ్గంతో దాడి చేసింది. ఈ దాడిలో పలువురికి గాయాలయ్యాయి. కొంతసేపటి తర్వాత పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అప్పుడు అఘోరి నాగసాధువు దుస్తులు ధరించి దర్శనానికి వెళ్లేందుకు ఒప్పుకుంది. ఆలయ అధికారులు, పోలీసులు స్వామివారి దర్శనం చేయించడంతో దర్శనం అనంతరం అఘోరి అక్కడి నుంచి వెళ్లిపోయింది.

సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయం తెలిసి శాంతి హోమం, చండీ హోమం, పూర్ణాహుతి జరుగుతున్న సమయంలో అఘోరి నాగసాధు అక్కడికి వెళ్లింది. భక్తులు అందరూ ఆశ్చర్యపోయారు. సాక్షాత్తు అమ్మవారే వచ్చిందని భక్తులు నమ్మారు. ఆలయానికి వెళ్లిన అఘోరీ హోమంలో పాల్గొని, ఒంటి కాలుపై నిలబడి పూజలు చేశారు.

నాగ సాధు అఘోరి గురించి తెలిసే ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో నాగ సాధు అఘోరి ఆలయాల సందర్శనకు పూనుకున్న సంగతి తెలిసిందే. ఆలయాలకు నాగ సాధు అఘోరి వెళ్లడం, వస్త్రాలు లేకుండా అనుమతించేది లేదని ఆలయ సిబ్బంది తేల్చి చెప్పడం ఈ మధ్య చూస్తూనే ఉన్నాం. వరంగల్‌లోని భద్రకాళి ఆలయంలో కూడా అప్పట్లో ఇదే జరిగింది.

వరంగల్ భద్రకాళి ఆలయానికి నాగ సాధు అఘోరి వెళ్లింది. ఆలయం వద్ద అఘోరిని దేవాలయ సిబ్బంది అడ్డుకున్నారు. వస్త్రాలు లేకుండా అనుమతించేది లేదని ఆలయ సిబ్బంది తేల్చి చెప్పారు. అఘోరిని చీర కట్టుకొని లోపలికి రావాలని భక్తులు కూడా కోరారు. దీంతో.. భక్తుల కోరిక మేరకు చీర కట్టుకొని అమ్మవారి దర్శనానికి ఆలయంలోకి నాగ సాధు అఘోరి వెళ్లింది.

# మోదీ నోట 'కోల్డ్ ప్లే' మాట.. కాన్సర్ట్ ఎకానమీకి ప్రధాని బూస్ట్

మొదటిపేజీ తరువాయి

భువనేశ్వర్: విశ్వవ్యాప్తంగా యువతను ఉర్రూతలూగిస్తున్న బ్రిటీష్ రాక్ బ్యాండ్ 'కోల్డ్ ప్లే'.. ఇప్పుడు భారత్‌లోనూ సందడి చేస్తోంది. ఇటీవల రెండు నగరాల్లో జరిగిన ఈ ఈవెంట్లకు యువత ఫిదా అయ్యారు. ఈ క్రమంలోనే తాజాగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా దీని గురించి మాట్లాడటం ఆసక్తికరంగా మారింది. ఒడిశా పర్యటనలో ఉన్న ప్రధాని.. తన ప్రసంగంలో 'కోల్డ్ ప్లే ' ప్రదర్శనలను ప్రస్తావించారు. కాన్సర్ట్ ఎకానమీకి బూస్ట్ ఇచ్చే దిశగా ఆలోచన చేయాలన్నారు.

ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో రెండు రోజుల పాటు జరిగే ఉత్కర్ష ఒడిశా సదస్సుకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. “ముంబయి, అహ్మదాబాద్‌లో నిర్వహించిన కోల్డ్‌ప్లే కాన్సర్ట్ అద్భుత చిత్రాలను మీరు వీక్షించే ఉంటారు. ఇలాంటి లైవ్ కాన్సర్ట్‌లకు మన దేశంలో మంచి స్కోప్ ఉందని చెప్పేందుకు ఆ షోలు నిదర్శనం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెద్ద పెద్ద కళాకారులు.. ఇప్పుడు భారత్‌వైపు ఆకర్షితులవుతున్నారు” అని మోదీ వ్యాఖ్యానించారు.

“గత 10ఏళ్లుగా లైవ్ ఈవెంట్లు, కాన్సర్ట్‌ల ట్రెండ్ పెరుగుతోంది. దేశంలో కాన్సర్ట్ ఎకానమీ రంగం రోజురోజుకీ వృద్ధి చెందుతోంది. సంగీతం, నృత్యం, కథలకు సంబంధించి మనది ఘనమైన వారసత్వం. ఇలాంటి దేశంలో కాన్సర్ట్‌లకు విశేష ఆదరణ లభిస్తుంది. ఇందుకు తగ్గ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు రంగాలు దృష్టి సారించాలి. కాన్సర్ట్ ఎకానమీకి మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలి” అని ప్రధాని సూచించారు.'మ్యూజిక్ ఆఫ్ ది స్పియర్స్ వరల్డ్ టూర్'లో భాగంగా కోల్డ్ ప్లే బ్యాండ్ భారత్‌లో ఐదు కాన్సర్ట్‌లను నిర్వహించింది. వీటికి విపరీతమైన క్రేజ్ లభించింది. ముంబయి, అహ్మదాబాద్‌లో ఇచ్చిన ఈ ప్రదర్శనలకు బాలీవుడ్, క్రీడా ప్రముఖులు హాజరై సందడి చేశారు.

# భారత మత్స్యకారులపై శ్రీలంక నేవీ కాల్పులు.. తీవ్రంగా స్పందించిన ఎంఈఏ

ఢభారత్‌కు చెందిన మత్స్యకారులపై శ్రీలంక నేవీ కాల్పులు జరపడంపై విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనలో ఇద్దరు మత్స్యకారులు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. మరో ముగ్గురుకి స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ శ్రీలంక రాయబారికి భారత్ సమన్లు జారీ చేసింది. అటు కొలంబోలోని భారత హైకమిషన్ కూడా ఈ విషయాన్ని శ్రీలంక విదేశాంగశాఖ ముందు లేవనెత్తినట్లు తెలిపింది.

శ్రీలంక తీరంలోని డెల్ఫ్ దీవికి సమీపంలోకి వెళ్లిన 13 మంది భారత జాలర్లను అక్కడి నౌకాదళం అడ్డుకుంది. తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన వీరిని అరెస్టు చేస్తున్న సమయంలో పలువురు తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం. దీంతో వారిపై శ్రీలంక నావికాదళం కాల్పులు జరిపింది. ఆ ఘటనలో ఇద్దరు మత్స్యకారులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని జాఫ్నా ఆసుపత్రిలో చేర్పించగా.. గాయపడిన మరో ముగ్గురితో పాటు మిగతావారందర్నీ శ్రీలంక పోలీసులు కస్టడీలోని తీసుకున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే



జాఫ్నాలోని భారత కాన్సులేట్ అధికారులు ఆసుపత్రికి వెళ్లి గాయపడిన జాలర్లను పరామర్శించారు.

ఇదే అంశంపై దిల్లీలోని శ్రీలంక రాయబారికి భారత్ సమన్లు జారీ చేసింది. మత్స్యకారుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకొని వారి సమస్యలపై మానవతా దృక్పథంతో వ్యవహరించాలని భారత్ ఎల్లప్పుడూ కోరుకుంటోందని విదేశాంగశాఖ వెల్లడించింది. ఎటువంటి పరిస్థితుల్లోనూ బలప్రయోగం చేయడం ఆమోదయోగ్యం కాదని మరోసారి తేల్చిచెప్పింది. ఈ విషయంలో ఇరు ప్రభుత్వాల మధ్య కొనసాగుతున్న అవగాహన ఒప్పందాలను కచ్చితంగా పాటించాలని సూచించింది.

# పర్యాటక పాలసీ తీసుకొచ్చి ఎకో టూరిజాన్ని ప్రోత్సహిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

టెంపుల్ టూరిజంతో రాష్ట్ర ఆదాయంతో పాటు పేరు ప్రఖ్యాతలు వస్తాయని సీఎం చెప్పారు. టెంపుల్ టూరిజం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్తున్నామని, శుభకార్యాలు చేయాలంటే రాజస్థాన్ లాంటి ప్రాంతాల్లో చేసుకుంటున్నారని గుర్తుచేశారు. ఇప్పటి వరకు ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు టెంపుల్ టూరిజం మీద దృష్టి పెట్టలేదని, రాష్ట్రంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రాంతాలు వెలుగులోకి రాలేదని, వాటికి దక్కాల్సినంత ప్రాధాన్యత రాలేదని సీఎం వ్యాఖ్యానించారు.

మన రాష్ట్రంలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, హెల్త్ టూరిజం వెనుక పడ్డాయని, రాబోయే రోజుల్లో ఎకో టూరిజం పాలసీ తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఇక్కడ ఉండే సహజ వనరులతో చాలా రోగాలు నయం అవుతాయని, టీబీ లాంటి సమస్య వస్తే ఇక్కడ రెండు మూడు నెలలు వదిలేస్తే రోగం నయమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. త్వరలో వికారాబాద్ ప్రాంతాన్ని ఎకో టూరిజంతో పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తామని, రాందేవ్ రావును మనస్ఫూర్తిగా సీఎం రేవంత్ అభినందించారు. ఎకో టూరిజం పాలసీలో భాగంగా ఇలాంటి పార్క్‌లను ఇంకా ఏర్పాటు చేస్తామని చెప్పారు. రామయ్య వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి కేంద్రం నుంచి పద్మశ్రీ అవార్డు అందుకున్నారని సీఎం కొనియాడారు. పని చేసే వారికి ప్రభుత్వం తగిన గుర్తింపునిస్తుందని చెప్పారు. ప్రతి విద్యార్థి స్కూల్‌లో తల్లి పేరు మీద ఒక మొక్క నాటాలనే కార్యక్రమాన్ని తీసుకువచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

## వరల్డ్ ఫేమస్ చెట్లతో ఎకో పార్క్ ఆకట్టుకుంటోంది : సినీ నటుడు చిరంజీవి

మొదటిపేజీ తరువాయి

చిలుకూరు బాలాజీ టెంపుల్ సమీపంలో వరల్డ్ క్లాస్ ఎక్స్ పీరియం ఎకో పార్క్ ను మంగళవారం (జనవరి 28) ప్రారంభించారు సీఎం రేవంత్ రెడ్డి. రంగారెడ్డి జిల్లాలో శంకర్?పల్లి పరిధిలోని పొద్దుటూరులో ఉంది. 150 ఎకరాల విస్తీర్ణంలో ఎకో పార్క్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 25వేల జాతుల మొక్కలను ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు, సినీ నటుడు చిరంజీవి, ఎంపీ సీఎం రమేష్,వనజీవి రామయ్య దంపతులు లు పాల్గొన్నారు. ఎకో ఎక్స్ పీరియం పార్కు ప్రారంభోత్సవంలో నటులు చిరంజీవి మాట్లాడుతూ..పార్కును అద్భుతంగా తీర్చిదిద్దారు.. మంచి టూరిజం స్పాట్ అవుతుంది.. వెడ్డింగ్స్, ఈవెంట్స్ కి అద్భుతంగా ఉంటుందన్నారు. ఈ పార్కులో ఏర్పాటు చేసిన చెట్లు బాగా ఆకట్టుకున్నాయన్నారు. ముఖ్యంగా వివిధ దేశాలనుంచి తెప్పించిన అద్భుత కళాఖండాలతో ఈ పార్క్ ను తీర్చిదిద్దారు.

# మీర్‌పేట హత్యకేసు.. నిందితుడి అరెస్టు

మొదటిపేజీ తరువాయి

గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని తెలుసుకున్న పోలీసులు.. గురుమూర్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తానే భార్యను హత్య చేశానని గురుమూర్తి అంగీకరించాడు. గురుమూర్తి చెప్పిన విషయాలపై ఆధారాలు సేకరించిన పోలీసులు తాజాగా అతడిని అరెస్టు చేశారు.

## మేం సాధించిన విజయాల్లో దావోస్ ఒప్పందాల సాధన అతి పెద్దది: రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తమ ప్రభుత్వం సాధించిన విజయాల్లో దావోస్ ఒప్పందాల సాధన అతి పెద్దదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సచివాయలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దావోస్ సదస్సు ద్వారా దాదాపు రూ.1.80లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినట్టు చెప్పారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు.“ప్రభుత్వంపై కొందరు చేసిన దుష్ప్రచారం పటాపంచలు అయ్యింది. ప్రభుత్వంపై, రాష్ట్రంపై నమ్మకం ఉంచుతూ భారీ పెట్టుబడులకు చాలామంది ముందుకు వచ్చారు. ఈ ప్రభుత్వంపై విశ్వాసం ఉంచుతూ అంతర్జాతీయ సంస్థలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయి” అని సీఎం వివరించారు.

# తెలంగాణలో బీఆర్ఎస్ చాప్టర్ క్లోజ్

మొదటిపేజీ తరువాయి

యువ రాజు కేటీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ సీనియర్ నేత దేవీ ప్రసాద్ లాంటి వ్యక్తికి ఎందుకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వరని నిలదీశారు రఘునందన్ రావు. అయినా.. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్, కేసీఆర్?కు వీఆర్ఎస్ ఇచ్చారని సెటైర్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉండటమే తెలంగాణలో ఆ పార్టీ పని అయిపోయిందనడానికి నిదర్శనమని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీఆర్ఎస్ తోక ముడవడంతో మూడు స్థానాల్లో బీజేపీ విజయం నల్లేరు మీద నడకేనని జోస్యం చెప్పారు ఎంపీ.

# రేవంత్ రెడ్డి అనాలోచిత చర్యల వల్ల తెలంగాణకు తీవ్ర నష్టం :

మొదటిపేజీ తరువాయి

ఒక పన్ను కట్టే సిటిజెన్‌గా రాష్ట్ర ఖజానాకు పన్నులు కడుతున్న నాకు నష్టం జరిగింది, తెలంగాణ ప్రజలకు నష్టం జరిగిందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

తెలంగాణలో వేలాది ఉద్యోగాలు వచ్చే అవకాశం కోల్పోయిన మనం ఇందులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా ప్రశ్నించాలి. వారి పాత్రనే ఎక్కువగా ఉన్నది. ఆనాటి ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని గొప్పగా తీర్చిదిద్దాలి, లక్షలాదిమందికి వేలాది మందికి ఉద్యోగాలు ఇవ్వాలన్న సంకల్పంతోని పెట్టుబడి పెడితే ఆ పెట్టుబడి నీరు గారే విధంగా ముఖ్యమంత్రి వ్యవహరించారు. ఈ సందర్భంగా నేను ఇవాళ నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో ముఖ్యమంత్రి మీద కూడా కేసు పెట్టాలని మొత్తం రీసెర్చ్ చేసి ఆ సమాచారాన్ని సేకరించి నా ఫిర్యాదులో పొందుపరిచాను అని ఆర్ఎస్పీ తెలిపారు.

# గద్దర్ పై బండి సంజయ్ వ్యాఖ్య

# స్పష్టమైన తెలంగాణ రాజకీయ ధ్రువీకరణ

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

**కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పద్మ అవార్డుల పట్ల సాక్షాత్తు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో రాజకీయ దుమారం మొదలైంది.పద్మ అవార్డులు వారికెందుకు ఇవ్వలేదు, వీరికెందుకు ఇవ్వలేదు అని మాట్లాడడం రాజకీయ రచ్చకు దారితీసింది.మంద కృష్ణ మాదిగకు పద్మ అవార్డ్ ఇవ్వడం పట్ల మాకు అభ్యంతరం లేదు, కానీ ఇంకా ఓ నాలుగు అవార్డులు తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఇస్తే ఏం పోయింది, ఏపి కి అన్ని ఇచ్చారు, తెలంగాణ పట్ల వివక్ష చూపారు అన్న అర్థంలో మాట్లాడాడు.ఈ అంశాన్ని పట్టుకున్న విలేఖర్లు మొన్న సోమవారం రోజు ఒక ప్రెస్ మీట్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ ని గద్దర్ కు పద్మ అవార్డు గురించి ప్రశ్నించారు.దానికి జవాబుగా బండి సంజయ్ మాట్లాడుతూ, గద్దర్ నక్సలైట్ హింసావాదానికి మద్దతు దారుడని, ఎంతో మంది బిజెపి కార్యకర్తల మరణానికి కారణమైన వ్యక్తి అని అతనికి పద్మ అవార్డు ఎలా ఇస్తారని జవాబిచ్చాడు.పద్మ అవార్డుల పరిశీలన, వ్యక్తుల ఎంపిక ఒక పద్ధతిలో సాగుతుంది.35 సం.ల అలుపెరుగని సామాజిక ఉద్యమాన్ని నడిపిన మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడం పట్ల యావత్ తెలుగు సమాజం, బడుగు బలహీన వర్గాలు హర్షం ప్రకటించాయి.**

- ఇక్కడ మంద కృష్ణకు, గద్దర్ కు పోటీ ఎందుకు?
- ఇక్కడే తెలంగాణ రాజకీయాల మాయారూపం ఒక్కసారి వెలుగు చూసింది.

### ఏమిటి ఆ రాజకీయ మాయారూపం ?

నిజాం వ్యతిరేక సాయుధ పోరాట కాలంలో కమ్యూనిస్టు భావజాలం తెలంగాణలో బలపడింది.తర్వాత 60 వ దశకంలో తెలెత్తిన కమ్యూనిస్టు నక్సలిజం ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో ముఖ్యంగా తెలంగాణలో ప్రభావ స్థితికి చేరుకున్నది.కమ్యూనిస్టులు రాజకీయ రంగంతో పాటు, పత్రికా రంగంలో, కార్మిక క్షేత్రంలో, ఇతర ప్రజా సంఘాల్లో ప్రభావం చూపుతూ వచ్చారు..కాలక్రమంలో కమ్యూనిస్టు పార్టీలు, అతివాద కమ్యూనిస్టు నక్సల్స్ పార్టీలు ముక్కలు చెక్కలుగా విడిపోయి సహకార సంఘాల మాదిరిగా ఎవరి సంఘం వారు స్థాపించుకున్నారు.

ఎవరి పార్టీ ఏదైనా అందరినీ మార్క్స్ వాదం, మావో వాదం ఒక కేంద్రంగా కలిపి ఉంచుతున్నది.ఈ కలయికలు ఎంత కాలం,ఎలా ఉంటాయి అన్న విషయం ఇప్పుడు చర్చనీయాంశం కాదు.కానీ, తాజాగా బండి సంజయ్ గద్దర్ పై చేసిన వ్యాఖ్యలు ఒక్కసారి తెలంగాణ రాజకీయాలను స్పష్టమైన ధ్రువీకరణ వైపు తీసుకు పోయాయి.

మొన్న అంబేద్కర్ ను అమిత్ షా విమర్శించాడని, నిన్న గద్దర్ ను బండి సంజయ్ విమర్శించాడని ఒక్కసారి కమ్యూనిస్టు థింక్ టాంక్ కార్యశీలంగా మారింది, బజారుకెక్కింది.

అమిత్ షా, బండి సంజయ్ లు ఇద్దరూ కేంద్ర హోం శాఖ భాద్యతలు చూస్తున్నారు.పద్మ అవార్డుల ఎంపిక నియమ నిబంధనలు వారికి స్పష్టంగా తెలుసు.గద్దర్ కు పద్మ అవార్డ్ ఎలా ఇస్తామని బండి సంజయ్ అనడంలో ఎంపిక నియమాలు ఉండి ఉంటాయి. ఆ కోణంలో మాట్లాడి ఉంటాడు. కానీ బండి మాట్లాడిన తీరు పదజాలం గద్దర్ అభిమానులకు నచ్చకపోయి ఉండవచ్చు.ఇక ఈ ధ్రువీకరణ రాజకీయాల విషయానికి వస్తే




గద్దర్ అభిమానుల పేరిట,గద్దర్ సిద్ధాంత అనుచరుల పేరిట నిన్న ఒక మీడియా సమావేశం జరిగింది.గద్దర్ గళం పేరిట నిర్వహించిన ఈ పత్రికా ప్రతినిధుల సమావేశంలో కొందరు గద్దర్ అభిమానులు మాట్లాడిన తీరు జనంలోకి వెళ్లింది.

బండి సంజయ్ వయసెంత? బండి సమాజానికి ఏం చేశాడు అంటూ గద్దర్ అభిమానులు బండి సంజయ్ పై విరుచుకు పడ్డారు.ఈ వాద ప్రతివాదాల వెనుక దేశ రాజకీయాల ప్రతిబింబం కనిపిస్తున్నదని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.బిజెపి, కమ్యూనిస్టుల సైద్ధాంతిక వైరం జగమెరిగిననదే.బీజేపీని అధికారంలోకి రానివ్వమని కేంద్ర సిపిఐ పార్టీ, రాష్ట్ర సిపిఐ పార్టీ ప్రతి ఎన్నికల్లో ప్రతిసారీ ప్రకటిస్తూనే ఉంటుంది. నిన్న సంగారెడ్డి లో జరిగిన సీపీఎం మహాసభలో కూడా ఇదే ఎజెండా ప్రకటించారు.కమ్యూనిస్టు ప్రభావిత జర్నలిస్టులు కూడా నిరంతరం ఈ అభిప్రాయాన్ని తమ వార్తల్లో, వ్యాసాల్లో ఎప్పుడూ వ్యక్తం చేస్తూనే వుంటారు.ఇక నిన్న జరిగిన గద్దర్ గళం ప్రెస్ మీట్ లో పాల్గొన్న గద్దర్ అభిమానులు ఇదే వైఖరిని కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడారు.ప్రెస్ మీట్లో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి గారు, గద్దర్ అభిమానుల సంఘం నాయకుడు సీఎల్ యాదగిరి, గద్దర్ గళం ఫౌండర్ చైర్మన్ కొల్లూరి సత్తయ్య గారు,సమ్మిరెడ్డి, ఐలేశ్ తదితరులు పాల్గొన్నారు.సత్తయ్య గారు,పాశం యాదగిరి గారు బండి సంజయ్ పై నిప్పులు గక్కారు.బండి సంజయ్ గద్దర్ కాలి గోటికి సరిపోడని ఘాటైన విమర్శ చేసారు.

బండి సంజయ్ అంతు చూస్తామని, వచ్చే ఎన్నికల్లో బండి సంజయ్ ను ఓడిస్తామని మాట్లాడారు.ఈ విమర్శలు రాజకీయాల్లో సర్వ సాధారణమే.ఎదుటి పక్ష నేతలను చంపుతం గుద్దుతం అన్నోల్లు మళ్ళీ తను విమర్శించిన పార్టీలో చేరిన సంగతులు కోకొల్లలు.తెలంగాణ ఉద్యమాన్ని విమర్శించిన వాళ్ళు టీఆర్ఎస్ అధిక్కరంలోనికి వచ్చిన తర్వాత కేసీఆర్ పంచన చేరి మంత్రి పదవులు పొందారని ఈ ప్రెస్ మీట్ లో మాట్లాడిన పాశం యాదగిరి గారు గతంలో తీవ్రంగా విమర్శించిన వాడే.ఆ నేతలే మళ్ళీ కాంగ్రెస్ లో గెలిచి వచ్చారు.ఇప్పుడు ఆ తెలంగాణ విరోధులు బహుశా పాశం యాదగిరి గారికి నచ్చుతున్నారేమో, వారి గురించి మాట్లాడడం లేదు.ఇక బండి సంజయ్ పై చెరిగిన నిప్పులు ఎప్పుడైనా ఆరిపోవచ్చు. సైద్ధాంతిక అభిప్రాయాలు చెప్పే హక్కు బండి కి కూడా ఉంది.బండి సంజయ్ ని ఓడించేది గెలిపించిన ప్రజలు ఓటర్లు. బండి సంజయ్ గెలుపులో గద్దర్ అభిమానుల పాత్ర లేనప్పుడు, ఓడించడంలో వారి పాత్ర ఏముంటుంది అని అప్పుడే ప్రతి విమర్శలు మొదలయ్యాయి.

ఇది రాజకీయం.. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం.ఎన్టీఆర్, ఇందిరా గాంధీ, అటల్ బిహారీ వాజ్ పాయ్ లాంటి దిగ్గజాలు ఎందరో ఎన్నికల ఓటమి చవిచూసిన వారే..తెలంగాణ ఉద్యమ నేత కేసీఆర్ పార్టీ మొన్న ఎన్నికల్లో ఓడిపోయింది, అధికారం కోల్పోయింది.ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కూడా గతంలో ఎమ్మెల్యేగా ఓడిపోయినవాడే.బండి సంజయ్ కూడా గెలిచినా ఓడినా అది సహజమే.గద్దర్ అభిమానుల పేరిట జరిగిన ప్రెస్ మీట్ బండి సంజయ్ వ్యతిరేకంగా కాదని, అది బిజెపి పై వ్యతిరేకత అని ప్రెస్ మెట్ చూసిన వారికి తెలిసిపోతుంది.ఈ గద్దర్ అభిమానుల వ్యతిరేకతకు ఒక చరిత్ర ఉన్నది.కానీ లాజిక్ లేదు.కమ్యూనిస్టులను వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీతో మళ్ళీ మళ్ళీ పొత్తులు పెట్టుకున్న కమ్యూనిస్టుల చరిత్ర స్పష్టమే కదా! ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యమంత్రి జలగం వెంగళ రావు నక్సలైట్లను ఊచకోత కోసాడని మొత్తుకున్న కమ్యూనిస్టులు మళ్ళీ కాంగ్రెస్ తో చేయి కలిపారు. వైఎస్సార్ కూడా బూటకపు ఎన్ కౌంటర్లు చేయించాడని కమ్యూనిస్టులు మొత్తుకున్న విషయం అందరికీ తెలుసు. చంద్రబాబు నాయుడు ఏకంగా గ్రే హౌండ్స్ పెట్టి నక్సలైట్లను చంపుతున్నాడని బజారుకెక్కడమే కాదు, తిరుపతి అలిపిరిలో చంద్రబాబు పై బాంబు బ్లాస్ట్ లు చేసిన విషయం జగద్విదితం.ఈ కమ్యూనిస్టు,నక్సలైట్ శక్తులు మళ్ళీ మళ్ళీ కాంగ్రెస్ తెలుగుదేశం పార్టీలతో పొత్తు పెట్టుకున్న విషయం ఎవ్వరూ మరచిపోనిదే.మొన్న ఇదే సిపిఐ టీఆర్ఎస్ తో,నిన్న కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకున్న విషయం మన కళ్ళెదుట జరిగిన వాస్తవమే కదా.అంతెందుకు 1989 ఆంధ్ర రాష్ట్ర ఎన్నికల్లో తెలుగుదేశం బిజెపి కమ్యూనిస్టులు కలిసి కూటమిగా పోటీ చేసిన విషయం కొందరు కావాలని మరచిపోయినా చరిత్ర మరవదు.

మళ్ళీ భవిష్యత్తులో కమ్యూనిస్టులు బిజెపి కూటమిగా పోటీచేసినా ఆశ్చర్యం లేదు.ఇక ఇప్పుడు బండి సంజయ్ అంతు చూస్తామని గద్దర్ అభిమాన సంఘాల ప్రకటన బిజెపి సంప్రదాయ రాజకీయ వ్యతిరేకతలోనిదే అని విజ్ఞుల అభిప్రాయం.ఇక గద్దర్ పట్ల బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు సైద్ధాంతిక కోణంలో నుండి చూడాల్సిన అంశం.రాజ్యాంగ రక్షణ అంటూ మాట్లాడేవారు బిజెపి కార్యకర్తల హత్యల గురించి మాట్లాడడం కూడా చెయ్యాలి.

బండి సంజయ్ ఒక మంత్రిగా మారక ముందు ఒక సాధారణ కార్యకర్త.

నక్షలైట్ విద్యార్థి సంఘాల తరపున అండర్ గ్రౌండ్ సాయుధ నక్సలైట్లు కాలేజీ క్యాంపస్ లలో ఎబివిపి విద్యార్థుల పై చేసిన దాడులు చాలా ఉన్నాయి. నల్గొండలో ఏచూరి శ్రీనివాస్ ను, వరంగల్ లో సామా జగన్ మోహన్ రెడ్డిని అతివాద కమ్యూనిస్టులు చంపిన విషయం ఎవ్వరూ మరచిపోలేదు.ఈ తీవ్రవాద కమ్యూనిస్టు శక్తుల సమర్ధకుడు గద్దర్ అని లోకానికి స్పష్టమే కదా. బండి సంజయ్ గద్దర్ గురించి సూటిగా మాట్లాడడం బహుశా గద్దర్ అభిమానులకు నచ్చకపోయి ఉండవచ్చు.ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని చెప్పుకునే కమ్యూనిస్టు శక్తులు, ప్రజలపై యుద్ధం చేసి చంపిన నక్సల్స్ వాహకం గద్దర్ అన్నది గద్దర్ జీవితమే చెబుతున్నది.గద్దర్ తుపాకీ పట్టని నక్సలైట్. కాదని ఎవరైనా అనగలరా?ఇలాంటి సైద్ధాంతిక విరోధి గద్దర్ ను బండి సంజయ్ పొగడాలని కోరుకోవడం అసహజం.గద్దర్ ను బండి సంజయ్ కాని, బిజెపి కాని విమర్శించిన విషయం పాతదే.

ఇక ప్రధాని మోడీ గద్దర్ మరణం పట్ల సంతాప లేఖ రాసాడని ముక్తాయింపు ఇవ్వడం కూడా అసహజం.మోడీ లేఖ గద్దర్ సిద్ధాంతాలను నమ్మి రాసింది కాదు. అది ఒక ప్రముఖుడి మరణం పట్ల సంతాప లేఖ.ప్రధానిగా మోడీ ప్రదర్శించిన ఉత్తమ గుణానికి ఆ లేఖ ఒక ప్రతీక.గద్దర్ మరణం గౌరవనీయమైనదే, కానీ ఆదర్శం కాదు. గద్దర్ హింస సిద్ధాంత పక్షపాతి.హింసను వ్యతిరేకించే మన జాతికి గద్దర్ ఆదర్శం కాదు.భారత దేశంలో ప్రతి మరణం గౌరవనీయమైనదే. మరణాన్ని ఆత్మ విముక్తిగా చూసే సంస్కారం మనది. మోడీ ఆ సంప్రదాయాన్ని పాటించిన ఉత్తముడు.మోడీ ఆదర్శ వ్యక్తిత్వ ప్రదర్శనకు, బండి సంజయ్ వ్యవహార శైలికి పోలిక పెట్టడం వల్ల గద్దర్ అభిమానుల లక్ష్య సాధనకు ఉపయోగం ఉండదు.ఎంతో మంది జాతీయవాద కార్యకర్తలను చంపిన ఈ కమ్యూనిస్టు శక్తుల అభిమాని గద్దర్ పట్ల బండి సంజయ్ భావావేశం వ్యక్తం చెయ్యడం పట్ల బిజెపి పార్టీ ప్రతి కార్యకర్త బండి వ్యాఖ్యతో మమేకమయ్యారు.ఈ ప్రెస్ మీట్ పెట్టిన గద్దర్ గళం సభ్యులు,గద్దర్ అభిమానులు నక్సలైట్ల హింసను సమర్థించగలరా?

బండి సంజయ్ గద్దర్ పై చేసిన వ్యాఖ్యలు కూడా ఈ అనుభవం,వేదన లోనుండే వచ్చాయని భావించవచ్చు.

గద్దర్ స్వయంగా తుపాకీ పట్టక పోయి ఉండవచ్చు, ఎలాంటి హత్యా చేయక పోయి ఉండవచ్చు.

కానీ రాజ్యాంగ వ్యతిరేక సాయుధ హింసకు గద్దర్ మద్దతు దారుడన్నది సత్యం.

గద్దర్ వ్యక్తిగత విశ్వాసాలను ఎవ్వరూ వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. అలాగని గద్దర్ విశ్వాసాలను గౌరవించాలని కూడా ఎవ్వరూ కోరలేరు..ఈ విశ్వాస అవిశ్వాసాలు చట్ట బద్ధమా కాదా? అన్నదే ప్రశ్న.బండి సంజయ్ సంబంధిత హోమ్ శాఖ మంత్రిగా స్పందించాల్సిన అధికారం అతనికి ఉన్నది.ఒక సైద్ధాంతిక నిబద్ధతతో మాట్లాడే స్వేచ్ఛ అతనికి రాజ్యాంగం కల్పించింది.గద్దర్ కూడా ఒక పౌరుడే. రాజ్యాంగానికి,చట్టానికి గద్దర్ అతీతుడు కాదు.గద్దర్ అభిమానిచేవారిని ఎవ్వరూ అడ్డుకోలేరు.ఈ దేశ సంస్కృతీ ప్రతీక అయిన శ్రీరాముడినే ప్రశ్నించినప్పుడు, గద్దర్ ప్రశ్నకు అతీతం కాదు.ఇక బండి సంజయ్ ను ఓడించే ప్రయత్నం గద్దర్ అభిమానులే కాదు, ప్రత్యర్థి పార్టీలు కూడా ప్రయత్నిస్తాయి. అది ప్రజాస్వామిక హక్కు.గద్దర్ అంశంతో తెలంగాణ రాజకీయాల రహస్య రూపం బండి సంజయ్ వ్యాఖ్యలతో బట్ట బయలు అయిందని అనిపిస్తున్నది.బిజెపి వ్యతిరేక శక్తులు బహిరంగమవుతున్నాయని భావించవచ్చు.ఆ శక్తులను ఎదుర్కోవడం బిజెపి పని.జరగబోయే సన్నివేశాలను చూడడం ప్రజల పని.అడుగడుగునా కనిపించే బిజెపి వ్యతిరేకత గద్దర్ పేరుతో పోలరైజ్ అయినట్టు తేటతెల్లంగా కనిపిస్తున్నది.రాబోయే రాజకీయ సవాళ్లను బిజెపి ఎలా ఎదుర్కొంటుంది అన్నది భవిష్యత్తులో చూస్తాం.కమ్యూనిస్టులకు ,నక్సల్స్ శక్తులకు స్వంతంగా రాజకీయ ఉనికి లేదని రాజకీయ పండితులకు తెలుసు.పెరుగు తోడులాగా ఈ వామపక్ష శక్తులు ఇతరులకు ఉపయోగపడతాయని విజ్ఞుల విశ్లేషణ.తెలంగాణలో బీజేపీని ఒంటరి చెయ్యాలని ప్రత్యర్థులు పని చేస్తూనే వుంటారు.రామజన్మభూమి ఉద్యమ సమయంలో దేశంలోని సెక్యులర్ పార్టీలు బిజెపిని అంటరాని పార్టీగా చూసాయి. కనీసం పొత్తు పెట్టుకోవడానికి కూడా ఏ పార్టీ కలిసి రాని పరిస్థితి అప్పుడు బీజేపీది.బిజెపి ఒంటరిగా మిగిలింది కదా అని ఒక విలేఖరి బిజెపి నాయకుడైన అద్వానీని ప్రశ్నించాడు.దానికి అద్వానీ జవాబు ఇస్తూ మా ఒంటరి తనమే మా బలం అని చెప్పిన విషయం నిజమైంది.బిజెపి దేశంలో బలంగా ఎదిగింది.తెలంగాణలో ఇప్పుడు బిజెపి ని అంటరాని పార్టీగా మార్చాలని కమ్యూనిస్టు శక్తులు పాత ఆటనే ఆడుతున్నట్టు అనిపిస్తున్నది. తెలంగాణలో బిజెపి ఒంటరితనం బలంగా మారుతుందా లేదా అనేది ఆ పార్టీ పనితీరు, వ్యూహాలపై ఆధారపడిఉన్నది. ఈ రాజకీయ ఆట ముందు ముందు ఎలా ఉండబోతుందో తెలంగాణ చూడబోతున్నది.

# యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్

# బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 28**

జమ్మికుంట పట్టణంలోని స్థానిక గాంధీ చౌరస్తాలో జమ్మికుంట మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది.మాజీ దేశ ప్రధానిగా ఎన్నో సంస్కరణలు చేసి ఈ దేశానికి సేవలందించిన ఉక్కు మహిళ ఇందిరా గాంధీ ని ఉగ్రవాది తో పోల్చడంపై బండి సంజయ్ వాఖ్యలను జమ్మికుంట మండల యూత్ కాంగ్రెస్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం. కేంద్ర మంత్రి స్థాయిలో ఉండి ఈ విధంగా మాట్లాడడం నీతిమాలిన చర్య అని యూత్ కాంగ్రెస్ పక్షాన హెచ్చరిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు పథకంలో, ఇందిరమ్మ ఫోటో ఉంటే మీకు ఇల్లు ఇవ్వము అని చెప్పడం ఒక దుర్మార్గమైన చర్యగా మేము భావిస్తున్నాం. అలాగే ఇందిరమ్మ ఇండ్లు పథకంలో 100 లో 85 శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు అయితే, మీ బిజెపి ప్రభుత్వం 15 శాతం వాటా ఇస్తే మీ ప్రభుత్వం నువ్వు ఏ విధంగా మాట్లాడుతున్నావో తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. అలాగే ప్రజా



యుద్ధనౌక గద్దర్ పైన నక్సలైటు హంతకుడు బిజెపి భావాజాలం లేని వ్యక్తికి మేము ఎలా అవార్డులు ఇస్తామని మీడియా వేదికగా అనడం జరిగింది. మరి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ చదివినప్పటికీ విదేశాలలో ఉద్యోగం చేస్తూ బంగారు జీవితాన్ని గడిపే అవకాశం ఉన్నప్పటికీ, పేద ప్రజలు బడుగు బలహీన వర్గాల కోసం తన గళంతో ప్రజలను చైతన్యం చేసి తెలంగాణ రాష్ట్రం సిద్ధించడంలో ముఖ్య భూమిక పోషించారు. అలాంటి వాగేయకారుడైన గద్దర్ ని మీరు అవహేళన చేయడం ఏమాత్రం సరికాదని మీరిచ్చే అవార్డులు రివార్డులు గద్దర్ గారి లాంటి గొప్ప వ్యక్తికి అవసరం లేదని! వారు తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల హృదయాలలో ఉన్నాడని కొనియాడారు. ఇకనైనా ఒళ్ళు దగ్గర పెట్టుకొని నడుచుకోవాలని బండి సంజయ్ కి సూచన ఇవ్వడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం నుండి కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న నీవు రాష్ట్రానికి ఏం నిధులు తీసుకొచ్చే ప్రయత్నం చేయకుండా, కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే ఆదరణను ఓర్వలేక అవాకులు - చేవాకులు మాట్లాడుతున్నావని, నీ అర్థం పర్థం లేని మాటలతో తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్నావని, ఇలాగే కొనసాగితే ఖబర్దార్ బండి సంజయ్ నిన్ను రాబోయే రోజులలో రోడ్ల మీద తిరగనియ్యమని, ఎక్కడికక్కడ సంజయ్ ని అడ్డుకుంటామని యూత్ కాంగ్రెస్ తరపున హెచ్చరించారు.ఈ కార్యక్రమంలోబీ యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షుడు బుడిగె శ్రీకాంత్, తెలంగాణ ఉద్యమకారులు అన్నం ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రశాంత్, సంపత్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అభిలాష్, ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్, కార్యదర్శులు అజయ్, వెంకటేష్, నాయకులు గణేష్, జావిద్, రాజ్ కుమార్, అష్రఫ్, శివ, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ భరోసా లబ్దిదారులకు న్యాయం చేయండి

## - వినతిపత్రం అందించిన మాజీ సర్పంచ్

**కరపత్రం రామగిరి ప్రతినిధి జనవరి 28**



రామగిరి మండలంరత్నాపూర్ లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్దిదారులకు న్యాయం చేయాలనీ తాజా మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు ఎంపీడీఓ బద్రి శైలాజరాణి కి మంగళవారం వినతిపత్రం అందచేశారు. రత్నాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో 133 మంది లబ్ధిదారుల ఎంపిక జరిగిందని, ఈ నెల 21వ తేదీన ముసాయిదా జాబితాలో 10 మంది పేర్లు ఉన్నాయని, తిరిగి గ్రామసభ ఈ నెల 25వ తేదీన మీటింగ్ జరుగగా అందులో పేర్లు తొలగించారని ఆమె తెలిపారు. భూమి ఉందని తొలగించినట్లు తెలిసిందని తెలిపారు. లబ్దిదారులకు భూమి ఇప్పించండి? లేదా లబ్దిదారులను అర్హులుగా గుర్తించాలని మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు ఎంపీడీఓ బద్రి శైలాజరాణిను కోరారు. ప్రస్థుతం కంప్యూటర్ లో సైట్ మూసివేశారని, తిరిగి సైట్ ఓపెన్ కాగానే ఈ పథకం మంజూరు చేస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ దుబ్బాక సత్యారెడ్డి, మాజీ ఎంపిటిసి ధర్ముల రాజసంపత్, బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి సందవేన కుమార్, మాజీ వార్డ్ మెంబర్ కొవ్వూరు సురేష్, బోగే సతీష్, మన్నాల రాహుల్, కెక్కర్ల మోహన్, కెక్కర్ల రాజేశ్వరి, కేశవేన మల్లేష్, తొగరు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం జనవరి 29 2025

## రామగుండం లోని పలు డివిజన్ లలో పనులను ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్.

(స్థానిక సంస్థలు )రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ ఏ సి )జె. అరుణ శ్రీ

**కరపత్రం రామగుండం జనవరి, 28:**



ఉపరితల మురుగు నీటి కాలువలను శుభ్రం చేయడానికై వాహనాలు వెళ్ళడానికి ఆటంకంగా ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ ఆదేశించారు. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ డివిజన్ లలో పలు సమస్యలను మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. 32వ డివిజన్ ఎల్ బి నగర్ లో ఇండ్ల మధ్య ఉన్న పెద్ద కాలువలో పూడిక తొలగించడానికి వాహనం వెళ్లడానికి ఇబ్బందవుతున్న దృష్ట్యా అడ్డుగా ఉన్న గోడలను తొలగించాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను ఆదేశించారు. పెద్ద పెద్ద కాలువల్లో యంత్రాలతోనే శుభ్రం చేయించాలని అన్నారు. 23వ డివిజన్ లోని అంబేద్కర్ కాలనీలో గుంతలోని మురుగు నీటిని సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ వాహనం సహాయంతో వెంటనే తొలగించాలని ఆదేశించారు. సమస్య శాశ్వత పరిష్కారం కొరకు తగు చర్య తీసుకోవాలని ఆదేశించారు. 22వ డివిజన్ లో నల్లా పైపులలో ఏర్పడిన లీకేజీ ని పరిశీలించి వెంటనే మరమ్మత్తు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణ పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ రాయలింగు, ఇ ఇ రామన్ , సానిటరీ ఇన్స్పెక్టర్ కుమార స్వామి , పారిశుద్ధ్య పర్యవేక్షకులు యూసుఫ్ , రాజబాబు , సంపత్ , సోమేష్ తదితరులు ఉన్నారు.

## అక్రమ ఇసుక బహిరంగ వేలం

**కరపత్రం జనవరి 28**

మల్లాపూర్ లో అక్రమంగా నిలువ ఉంచిన అనుమతి లేని ఇసుకను రెవెన్యూ అధికారులు మరియు పోలీస్ సిబ్బంది దాడులలో పట్టుకోవడం జరిగినది ఇట్టి ఇసుకను సుమారు 7 ట్రిప్పులు 29 జనవరి 2025 బుధవారం ఉదయం 11 గంటలకు తాసిల్దారి వారి కార్యాలయం ఎదుట గల ఇసుక కుప్పల ఉన్న ప్రాంతం వద్ద వేలం వేయనున్నారు ఆసక్తి గలవారు ఇట్టి వేలంలో పాల్గొనవచ్చునని తాసిల్దారు వారి కార్యాలయం తెలిపారు

## హాస్టల్ నుండి పారిపోయి వచ్చిన ఇద్దరు బాలురను పోలీసులకు అప్పజెప్పిన పెంట ప్రణయ్ తేజ.



**కరపత్రం ప్రతినిధి,మెట్ పల్లి, జనవరి 28.**

హాస్టల్ నుండి పారిపోయి వచ్చిన ఇద్దరు బాలురను సోమవారం రాత్రి పోలీసులకు యువజన కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జ్ పెంట ప్రణయ్ తేజ అప్ప చెప్పినట్లు మంగళవారం తెలిపారు. సోమవారం రాత్రి మెట్పల్లి బస్టాండ్ లో ఇద్దరు బాలు అనుమానస్పదంగా కనిపించడంతో ఆ బాలురను విచారించగామేము భీంగల్ మైనార్టీ హాస్టల్ నుండి పారిపోయి వచ్చినాము మా ఊరు గుమ్మిరియాల అని తెలిపినట్లు యువజన కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జ్ పెంట ప్రణయ్ తేజ అన్నారు. పట్టణ ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు షేర్ భరత్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాజా అజీమ్ లు బస్టాండ్ స్టేషన్ మాస్టర్ సురేష్ 100కు ఫోన్ చేసి ఆ బాలురులను పోలీసులకు అప్పగించడం జరిగిందని తెలిపారు. అనంతరం వీరు చేసిన మంచి పనికి పలువురు వీరిని అభినందించారు

## కొత్త స్వశక్తి సంఘాల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి...

- సంఘాలలో లేని పేద మహిళలను గుర్తించి కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలి.
- మెప్మా సిబ్బందిని ఆదేశించిన జిల్లా అదనపు కలెక్టర్ అరుణ శ్రీ..



కరపత్రం రామగుండం జనవరి, 28:గద్దర్ పై బండి సంజయ్ వ్యాఖ్య స్పష్టమైన తెలంగాణ రాజకీయ ధ్రువీకరణ

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పద్మ అవార్డుల పట్ల సాక్షాత్తు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో రాజకీయ దుమారం మొదలైంది.

పద్మ అవార్డులు వారికెందుకు ఇవ్వలేదు, వీరికెందుకు ఇవ్వలేదు అని మాట్లాడడం రాజకీయ రచ్చకు దారితీసింది.

మంద కృష్ణ మాదిగకు పద్మ అవార్డ్ ఇవ్వడం పట్ల మాకు అభ్యంతరం లేదు, కానీ ఇంకా ఓ నాలుగు అవార్డులు తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఇస్తే ఏం పోయింది, ఏపి కి అన్ని ఇచ్చారు, తెలంగాణ పట్ల వివక్ష చూపారు అన్న అర్థంలో మాట్లాడాడు.

ఈ అంశాన్ని పట్టుకున్న విలేఖర్లు మొన్న సోమవారం రోజు ఒక ప్రెస్ మీట్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ ని గద్దర్ కు పద్మ అవార్డు గురించి ప్రశ్నించారు.

# ఎన్టీపీసీ పిటిఎస్ జిల్లా పరిషత్ హైస్కూల్ లో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం.

- కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలతో కలిసి పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్.

**కరపత్రం రామగుండం జనవరి,28:**

పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం ఎన్టీపీసీ పిటిఎస్ జిల్లా పరిషత్ హైస్కూల్ లో జరిగిన ప్రజా సేకరణ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే రాజు ఠాగూర్ మాట్లాడుతూ ఎన్టిపిసి ప్రభావిత ప్రాంతాలు అయినటువంటి కాశి పల్లి ,మాతంగి కాలనీ,ఎలుకలపల్లి , లక్ష్మీపురం, ఎలకలపల్లి గేట్, గుంటూరుపల్లి, కాశిపెల్లి, కుందనపల్లి, మల్యాలపల్లి , రాజాపురం, మేడిపల్లి, అన్నపూర్ణ కాలనీ, చల్లపల్లి, దుర్గాపల్లి, గోలి వాడ, మల్కాపురం, వీర్లపల్లి, రానాపురం, కన్నాల, బాబుల నాయక్ తండ, జంగాలపల్లి, మొదలగు గ్రామాల ప్రజలు ఎన్టీపీసీ వలన అనేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఆయా గ్రామాల ప్రజల శ్రేయస్సు కోసం, వారి ఆరోగ్యం కోసం అదేవిధంగా ఆయా గ్రామాల అభివృద్ధికి అవసరమైన సౌకర్యాల కల్పన కోసం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ అధికారులకు ఆయా గ్రామాల ప్రజలతో కలిసి తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం జిల్లాలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ లబ్బర్ స్టాంప్ గా వ్యవహరిస్తుందని,ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిని ఎన్టిపిసి యజమాన్యం విస్మరిస్తుందని, స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు ప్రాధాన్యత కల్పించాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల నియామకాల విషయంలో అవినీతి జరుగుతుంది.కలెక్టర్ ద్వారా ఉద్యోగ నియామకాలు చేపట్టాలి,నీరు నిధులు నియమాకాల విషయంలో ఎన్టిపిసి యజమాన్యం పారదర్శకంగా వ్యవహరించాలన్నారు ఎన్టిపిసి అధికారులు ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలని వారిని ఎలాంటి ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవు అనేసి హెచ్చరించారు రోడ్లు చెరువులు పట్టణ అభివృద్ధి



పనులు సి ఎస్ ఆర్ నిధులు ఖర్చు చేయాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ ఎన్టిపిసి ప్రభావిత ప్రాంతాలకు ఎన్టిపిసి వారు చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను తెలిపారు.ఎమ్మార్వో కార్యాలయం నుండి కమిషనర్ ఆఫ్ పోలీసు కార్యాలయం వరకు అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్లను పూర్తి చేయాలని ఎమ్మార్వో కార్యాలయం నుండి ఎన్టీపీసీ పిటిఎస్ మెయిన్ గేట్ వరకు నిరుపయోగంగా ఉన్న 8 హై టెన్షన్ టవర్లను తొలగించాలని పోలీస్ కమిషనర్ కార్యాలయం,సోలార్ ప్లాంట్ మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో ఒక్క అధునాతన స్టేడియం స్థానిక ప్రజల ఉపయోగార్థం నిర్మించాలి.

గోదావరిఖని, గోలివడా సమ్మక్కా జాతర జరిగే అభివృద్ధి చేసి దేవాదాయ శాఖకు అప్పగించాలి.ఎన్టీపీసీ పోలీసు స్టేషన్ నుండి ఎమ్మార్వో ఆఫీస్ మధ్యలో పెట్రోల్ బాంక్ నిర్మాణం కోసం 100 ఎం ఎక్స్ 100 ఎం స్థలాన్ని కేటాయించాలి. ఎన్టీపీసీ ప్రస్తుతం ఉన్న ప్లాంట్లలో, రాబోయే ప్లాంట్లలో స్కిల్డ్, సెమి- స్కిల్డ్, అన్- స్కిల్డ్ క్యాటగిరి లలో 100 శాతం స్థానిక నిరుద్యోగ యువతకు మాత్రమే ఉపాధి కల్పించాలి. కాలుష్యం భారిన పడుతున్న మతాంగి కాలనీ ఇళ్లను తరలించి వారికి పునరావాసం కల్పించాలి.

కాంట్రాక్టు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు అన్ని వసతులతో కూడిన హాస్పిటల్ ను ఏర్పాటు చేసి వైద్య సౌకర్యాలు అందించాలి.కాంట్రాక్టు కార్మికుల,



అవుట్ సోర్సింగ్ కార్మికుల కనీస వేతనాలు,అలవెన్స్ లు పెంచాలి.360 కోట్ల రూపాయలు ప్రభావిత డివిజన్లలో,గ్రామాలలో మౌలిక వసతుల అభివృద్ధి కొరకు కమ్యూనిటీ హాళ్లు, స్కూల్స్, రోడ్స్, డ్రైనేజీ, నిర్మాణం కోసం నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి.

సి.ఎస్ ఆర్ నిధులు కేవలము రామగుండం నియోజకవర్గంలో మాత్రమే ఖర్చు చేయాలి. రామగుండం చెరువు పునరుద్ధరణ చేపట్టాలి ( యాష్ ప్లాంట్ )ఎన్టీపీసీ పోలీసు స్టేషన్ నుండి మార్కెట్ వరకు ఉన్న ఖాళీ స్థలంలో 100 షాప్ ల నిర్మాణం చేపట్టాలి.పైన పేర్కొన్న ప్రధాన డిమాండ్లను పరిశీలించి రామగుండం నియోజకవర్గంలో ఉన్నటువంటి ఎన్టీపీసీ సంస్థ రామగుండం అభివృద్ధికి అండగా ఉండాలని , ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాల ప్రజలు,కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రజా అభిప్రాయ సేకరణ జరుగుతున్న ప్రదేశం వద్దకు వెళ్లి తమ అభిప్రాయాలను తెలియజేసారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష , అడిషనల్ కలెక్టర్ అరుణ శ్రీ రామగుండం ఎమ్మార్వో కుమారస్వామి , అంతర్గాం ఎమ్మార్వో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు తూము రవీందర్ పటేల్,ఎన్టీపీసీ ప్రభావిత ప్రజలు, మేయర్ అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత ప్రభుత్వ అధికారులు,తదితరులు అధిక సంఖ్యలోపాల్గొన్నారు.

## సమస్యలకు నిలయం కెసిఆర్ కాలనీ



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు

**కరపత్రం న్యూస్ కోరుట్ల: జనవరి 28?**

కోరుట్ల పట్టణంలో గల కెసిఆర్ కాలనీని మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి తో కలిసి సందర్శించారు ఈ సందర్భంగా కెసిఆర్ కాలనీలో నివసిస్తున్న ప్రజలు డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని ఇప్పటివరకు తమకు ఇండ్ల పట్టాలు కూడా ఇవ్వలేదని జువ్వాడి కృష్ణారావుకు మొరపెట్టుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇట్టి విషయాన్ని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం నాయకులు పుప్పాల ప్రభాకర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నజ్జు లక్ష్మణ్ కెసిఆర్ కాలనీవాసులు పాల్గొన్నారు

## “ఖని “ లో ఘనంగా హజ్రత్ తాజొద్దీన్ బాబా జన్మదిన వేడుకలు..

**కరపత్రం రామగుండం జనవరి, 28:**

పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం కాకతీయ నగర్ 46వ డివిజన్ తాజోద్దీన్ బాబా 164 జన్మదిన వేడుకలు సోమవారం రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారదాసు సతీష్ మాట్లాడుతూ గత 32 సంవత్సరాల నుంచి మా తండ్రి నిర్వహించారు. మా తండ్రి కీర్తిశేషుడు అయినా అప్పటినుంచి ఈ జన్మ దిన వేడుకలు అతని తనయుడు నారదాసు సతీష్ రావు ఆధ్వర్యంలోనిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా గోదావరిఖని చౌరస్తా వద్ద భక్తులతో కలిసి చందల్ ఊరేగింపు ప్రారంభించారు అనేక జిల్లాల నుంచి వచ్చిన భక్తులు నృత్యాలతో లక్ష్మీ నగర్ కళ్యాణ్ నగర్ ఊరేగింపుగా స్థానిక 46వ డివిజన్ కాకతీయ నగర్ చెందినటువంటి హజ్రత్ తాజోద్దీన్ బాబా వరకు జయంతి వేడుకలు ఘనంగా ఊరేగించారు. అనంతరం మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు కీర్తనలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం




కార్యక్రమం నిర్వహించారు హజ్రత్ తాజోద్దీన్ బాబా పుట్టినరోజు వేడుకలు మూడు రోజుల పాటు ఉంటుందని అన్నారు. ఈ పూజా కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే రాజు ఠాగూర్ సతీమణి మనాలి ఠాగూర్ దంపతులు పాల్గొనడం జరిగింది. అధిక సంఖ్య భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు,సీనియర్ నాయకులు,కార్యకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆలు లేదు, చూలు లేదు, కొడుకు పేరు సోమలింగము....

- ఎస్సీ అయితే నీవు బీసీ అయితే నేను
- గ్రామాల్లో ఎక్కడ చూసినా రచ్చబండ దగ్గర జరుగుతున్న చర్చ

**కరపత్రం ధర్మపురి జనవరి 28:**

“సర్పంచ్ ఎన్నికలు అంటున్నారు.. నిజమేనా.! బీసీలకు రిజర్వేషన్లను పెంచుతారా? మళ్ళీ బిసి అవుతుందా..ఎస్సి అవుతుందా అని ఎవరికి వారే లెక్కలు వేసుకుంటున్నారు.బిసి అయితే నేను,అని ఎస్సి అయితే నీవు అని వాళ్లకు వాళ్లే చర్చించుకుంటున్నారు. ఈసారి మన ఊరు సర్పంచ్‌గిరీ ఎవరికి వస్తదో!” ప్రస్తుతం పల్లెల్లో రచ్చబండల దగ్గర జరుగుతున్న చర్చ ఇది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపైనా ఇదే చర్చ. ఏ గ్రామంలో చూసినా “ఎన్నికలు ఎప్పుడంటున్నారు?” అనే ప్రశ్నతోనే సంభాషణలు మొదలవుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల మార్పునకు సంబంధించి కూడా విస్తృత చర్చ జరుగుతోంది. రిజర్వేషన్లు మారితే తమ గ్రామాల్లో సర్పంచ్‌గా, మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీగా ఏ సామాజిక వర్గానికి అవకాశం వస్తుందనే దానిపైనా బేరీజు వేస్తున్నారు. మరోవైపు రాజకీయ పార్టీల ద్వితీయ శ్రేణి నాయకత్వం కూడా స్థానికంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందుకోసం గ్రామం,




మండల స్థాయిలో ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. పార్టీల వారీగా ఎవరి వర్గాలను వారు బలోపేతం చేసుకుంటున్నారు. ఓటర్ల జాబితాలపైనా ప్రత్యేక దృష్టి పెడుతూ.. ప్రస్తుతం జాబితాలో ఎవరెవరు ఉన్నారు? ఎన్నికల నాటికి కొత్తగా ఓటు హక్కు వచ్చేవారు ఎవరైనా ఉన్నారా? అనేదానిపై గ్రామాల్లో తూర్పార పడుతున్నారు. మొత్తంగా స్థానిక జోష్ మొదలైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మరోవైపు అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. క్షేత్రస్థాయిలోనూ ఇదే తంతు మొదలైంది.ఇప్పటినుండే గ్రౌండ్ స్థాయిలో ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నట్లు వినిపిస్తున్నాయి. ఇక కొంతమంది అయితే ఎన్నికల్లో గెలుపొందేందుకు ఎంత ఖర్చుకైనా వెనుకాడేది లేదంటూ రెడీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఎండపల్లి మండలం మారేడుపల్లి గ్రామంలో ఇప్పటికే ఎస్సి నుండి సుమారు ఏడూగురు, బిసి నుండి ఐదుగురు అభ్యర్థులు పోటీకి సిద్ధంగా ఉండే అవకాశం లేకపోలేదు. ఏ కుల సంఘాల ఓట్లు ఎక్కువ ఉంటే వారి కుల పెద్దలను మెప్పించే పనిలో అభ్యర్థులు వారి స్థాయికి మించి ప్రయత్నాల్లో నిమగ్నం అవుతున్నారు.ఇక ఇప్పటినుండే ఓటర్లను మెప్పించే పనిలో ముక్క, చుక్క తాగిపించడంలో నిమగ్నం అవుతున్నారనే ప్రచారం జోరుగా ఊపందుకుంది. ఏది ఏమైనా గ్రామాల్లో డబ్బుల రాజకీయానికి పట్టం కడతారా లేదా ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులకు పట్టం కడుతారో ఇంకా కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.